

మరో అడుగు

-డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

భర్త చెప్పకుండానే, చెప్పిన మాటలని విన్న యశోద మనసు మూగబోయినట్టుగా ఉండిపోయింది.

నెమ్మదిగా గొంతు పెగుల్చుకుని " ఇప్పుడు ఏమౌతుంది?" అని అడుగుదామని అనుకుంది కానీ మాట రాలేదు.

" నువ్వు తప్ప నాకెవ్వరూ లేరు,' అన్నట్టు గా భర్త చేతిని మరింత గట్టిగా పట్టుకుంది.

ఎప్పుడూ ఆనందంగా నవ్వుతూ ఉండే అందమైన యశోద ముఖంలో నిండా అలుముకున్న దిగులు, కళ్ళల్లో నీళ్ళు చూసి చలించిపోయారు కేశవ.

వెంటనే భార్యని గట్టిగా హత్తుకున్నారు.

కళ్ళు మూసుకుని, భర్త భుజం మీద తల వాల్చి ఆయనకు దగ్గరగా జరిగింది ఆవిడ.

మాటలు రాక, మౌనాన్ని దాటలేక ఇద్దరూ దాదాపు పదినిమిషాలు అలాగే ఉండి పోయారు.

ముందుగా కేశవరావుతేరుకుని, మొదట యశోద కన్నీరు తుడిచి, తర్వాత తన కన్నీరు తుడుచుకున్నారు.

మాటలు చెప్పలేని భావాలు అవి. ఏళ్ళతరబడి, వారిద్దరి మధ్యా పెనవేసుకున్న మధురానుబంధం అది.

" యశూ! నువ్వు చెప్పినట్టు మనిద్దరిమధ్యా ఎప్పుడూ ఏ రహస్యాలు లేవు, ఉండవు. ఇది మనం మన వివాహ జీవిత గమనానికి నిర్దేశించుకున్న మార్గం. దానికి ఏ విషయం లోనూ మినహాయింపు లేదు. ఇప్పుడు ఇదైనా అంతే."

"కదా!" అంటూ ఉండగానే,

" అవును! అందుకే కదా, ఏం జరిగిందో? డాక్టర్ ఏమన్నారో? చెప్పమనేది!" అంది.

" కరక్ట్! అందుకే నేను చెప్పేది శ్రద్ధగా విను. ఇందాకా ఫోన్ లో డాక్టర్ షా చెప్పినది విన్నప్పుడు, నేనసలు ఏం వింటున్నాననేది నాకే అర్థం కాలేదు. కానీ ఆయన చెప్పినది మాత్రం 'గుడ్ న్యూస్' కాదు యశూ. ఏదో మమూలు

కణితి అనుకున్నది ' క్యాన్సర్ కంతి' అని చెప్పారు. అంతే కాక, ఆ ట్యూమర్ శరీరంలో బాగా పాకిందిట. వైద్య పరిభాషలో దాన్ని 'మెటాస్టాసిస్' అంటారు'' అని దిగులు నిండిన ముఖంతో చెప్పారు కేశవ్.

తన మాటలని కొనసాగిస్తూ "ఈ మధ్యన చాలా రకాల మంచి ట్రీట్ మెంట్లు వచ్చాయనీ, అన్నీ అనుకూలిస్తే తప్పకుండా తగ్గిపోతుందనీ చెప్పారు. అందువల్ల మనం ధైర్యంగా ఉండి పరిస్థితిని ఎదుర్కోవడమే కావలసినది అని ప్రత్యేకంగా చెప్పారు. 'టైము పట్టచ్చు కానీ తప్పకుండా తగ్గుతుంది' అని నమ్మకంగా చెప్పారు. నువ్వు ఎప్పటిలా ధైర్యంగా ఉంటే తప్పకుండా తగ్గిపోతుంది. డాక్టర్ ఎక్కడికి వెళ్ళమంటే అక్కడకి వెళదాం, ఏ ట్రీట్మెంట్ అయినా చేయిద్దాం. నీకేం కాదు, నన్ను నమ్ము'' అన్నారు కేశవరావు భార్య భుజం మీద చేయి వేసి దగ్గరకు తీసుకుంటూ.

తర్వాత ఆయన తన నోట్స్ లో రాసుకున్న పాయింట్ల ని తన కి అర్థమైనంత వరకూ యశోదకి వివరించి చెప్పారు.

అప్పుడు నెమ్మదిగా మామూలు కబురలోకి దింపి అనేక విషయాలగురించి మాట్లాడి ఆమెని కాస్త స్వాంతన పరిచే ప్రయత్నం చేశారు.

ఓ గంట తర్వాత

" డాక్టర్ దగ్గరకెళ్ళి రిపోర్ట్ తెచ్చుకుని వస్తాను. ఆ తర్వాత దాంట్లో ఏముందో చూసి అప్పుడు మిగతా వివరాలు తెలుసుకుందాం. వెళ్ళి రానా?" అన్నారు.

తన ఆరోగ్యం విషయం లో అలాంటి వార్త విన్నాకా, దాన్ని ఒక్కసారిగా తట్టుకోవడం యశోద వల్ల కాలేదు.

అదే మాట కేశవరావుతో అంది.

" ఈ పరిస్థితిలో నేను ఒక్కదాన్ని ఉండలేను ఇంట్లో. అసలే అక్కరలేని ఆలోచనలన్నీ నా మనసునిండా అలుముకుని గందరగోళంగా, అగమ్యగోచరంగా ఉంది. దానికి తోడు ఈరోజు విన్న ఈ వార్త. నాకు ఎంత భయంగా ఉందో చెప్పలేను, మీరు లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేను అనిపిస్తోంది. ప్లీజ్, నేను కూడా మీతో వస్తాను" అంది యశోద నీరసం, నీళ్ళు నిండిన కళ్ళతో.

కేశవరావు కి ఏం చెప్పాలో తెలియలేదు. 'ఈ పరిస్థితిలో ఆమెని డాక్టర్ దగ్గరకి తీసుకువెళ్ళడం మంచి పనేనా?' అని ఆలోచించారు.

ఒక్కదాన్నీ ఇంట్లో వదిలి వెళ్ళడం కూడా కరక్ట్ కాదుఅని కూడా అనిపించింది ఆయనకి.

'కేన్సర్, శరీరమంతా పాకింది ' లాంటి మాటలు చాలా భయపెట్టాయని ఆయనకి అర్థం అయింది. కానీ మళ్ళీ ఇప్పుడే హాస్పటల్ లాంటి వాతావరణం లోకి తీసుకువెళ్ళడం ఆయనకి ఇష్టం లేకపోయింది.

" అలసి పోయావు కదా యశూ! కాసేపు రెస్ట్ తీసుకోకూడదూ? కరుణని నీ దగ్గరే కూర్చోమను. కబుర్లు చెప్తుంది. యష్ వచ్చేస్తున్నాను, దార్లో ఉన్నాను అన్నాడు. ఏమంటావు?" అన్నారు కేశవ్.

అప్పటివరకూ వెంటనే వస్తానని పట్టు బడుతున్న యశోద కూడా ఒక్క క్షణం ఆలోచించింది.

'ఈ పరిస్థితిలో కొంత సేపు తను ఒక్కతే ఉండడం వల్ల జరుగుతున్నదాన్ని జీర్ణం చేసుకోవడానికీ, ఆలోచించడానికీ కాస్త సమయం దొరుకుతుందని అనిపించింది. పైగా తను వెంటే ఉంటే భర్త కూడా ఎవరితోనైనా మాట్లాడాలనుకున్నా కుదరదు కదా!' అనుకుంది.

' నాకేమీ కాదు,' అనుకుని భ్రమలో బ్రతకడంతనని తాను మోసం చేసుకోవడమే. ఎదురుగా కనబడుతున్న నిజాన్ని గుర్తించలేకపోవడమే

ఏరకంగా చూసిన అది సరి అయిన దారి కానే కాదు.

అలా అనుకున్నాకా ఏది జరిగినా దాన్ని ఎదుర్కోవడమే సరి అయిన మార్గం అనిపించింది యశోదకి.

దానికి తనని తాను సిద్ధపరుచుకోవడానికి కూడా తనకంటూ కొంత సమయం కావాలనీ, తనతో తాను గడిపే ఆ క్షణాలు స్వాంతనని తెస్తాయని అనుకుంది.

అలా అనుకున్నాకా, కళ్ళు తుడుచుకుని భర్త వైపు తిరిగి" సరే! నేను ఉంటానులెండి. మీరు వెళ్ళి తొందరగా వచ్చెయ్యండి. ఎదురు చూస్తూ ఉంటాను" అంది.

"దట్స్ బెటర్!"

"మెడికల్ సైన్స్, ట్రీట్ మెంట్స్ కూడా మన ఊహకి అందనంతగా అభివృద్ధి చెందాయో యశూ. మనందరికోసం నువ్వు ధైర్యంగా ఉంటే మనం ఈ పరిస్థితిని తప్పకుండా ఎదుర్కొని విజయం సాధిస్తాం. ప్లీజ్! మనకోసం, మన కుటుంబం కోసం నువ్వు ధైర్యంగా ఉండు. ఇప్పుడే, ఇక్కడే ఉన్నట్టుగా వచ్చేస్తాను." అంటూ ఆయన యశోద భుజం మీద అనునయంగా తట్టి బయటకు వెళ్ళిపోయారు.

భర్త వెళ్ళిన తర్వాత మంచం మీద కూర్చుని కొన్ని క్షణాలు ఆలోచనల్లో ఉండి పోయింది. తర్వాత 'ఏం జరుగుతుంది? అసలు తన పరిస్థితి ఏమిటి?' అని ప్రశ్నలు వేసుకుంది.

'నాకే ఎందుకు ఇలా జరగాలి? ఇన్ని లక్షల కోట్ల మందిలో నేనే ఏం తప్పు చేశాను?' అనుకోవడం అర్థం లేనిదిగా అనిపించింది.

'మనకి అనుకోకుండా మంచి జరిగినప్పుడు ఎప్పుడూ ఈ ప్రశ్న వేసుకోము కదా?

ఏ సంఘటనైనా ఎవరో ఒకరికి జరగవలసినదే కదా, దానికి ఫలానా వాళ్ళకే జరగాలి అని ఉండదు కదా!

అదే, ఏదైనా మనకి నచ్చని విషయం జరిగితే మాత్రం ఇలాంటి ప్రశ్నలు వేసుకుంటాం. ఇది ఎంతవరకూ కరక్ట్? ' అనుకోసాగింది.

ఎన్నో రకాల ఆలోచనలు మనసులో సుళ్ళు తిరగసాగాయి. తను చదివిన విషయాలు, ఎన్నో రకాల వార్తలూ గుర్తు వచ్చాయి యశోదకి.

ముఖ్యంగా ఈ మధ్యనే చదివిన Arthus Ashe అనే గొప్ప టెన్నిస్ క్రీడాకారుడి గురించిన వ్యాసం.

ఆ వ్యాసమే గుర్తుకు రావడానికి ఈ మధ్యన చదవడమే కాకుండా, చాలా ప్రత్యేక కారణాలున్నాయి.

తను ఎంచుకున్న రంగంలో గొప్ప స్థాయికి చేరుకున్నాకా ఎన్నో దురదృష్టకరమైన సంఘటనలు వరసగా జరగడం, అయినా అతను దాన్ని ఎదుర్కొని నిలవడం.... ఇవన్నీ గుర్తు చేసుకుంది.

'1943 లో పుట్టిన Athur అనతి కాలంలోనే చాలా గొప్ప క్రీడాకారుడిగా ఎదిగాడు. మూడు Grand slam గెలుపులతో పాటు 33 టైటిల్స్ గెలుచుకుని 1968 లో ప్రపంచపు నెంబర్ వన్ ఆటగాడిగా గుర్తించబడ్డాడు.

అయితే 36 ఏళ్ళ వయసులో టెన్నిస్ కోచింగ్ క్లాస్ తీసుకుంటూ ఉండగా, ఆర్థర్ కి ఉన్నట్టుండి విపరీతమైన గుండె పోటు వచ్చింది.

ఎప్పుడూ చెదరని క్రమశిక్షణతో ఆరోగ్యాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుకుంటూ ప్రపంచంలోనే ఫిట్ అయిన క్రీడాకారుడైన అతనికి గుండెపోటు రావడమే చాలా ఆశ్చర్యం అనుకుంటే, ఆ సంవత్సరమే Quadruple Bypass surgery అనే అత్యంత కఠినమైన ఆపరేషన్ చెయ్యవలసి వచ్చింది.

దానివల్ల జీవితమే తలక్రిందులైంది.

ఇకపైన తాను ఇదివరకటిలాగా ఆడడం కుదరదని, ముఖ్యంగా టెన్నిస్ కోర్ట్ లో పరిగెత్తడం అనేది జరగదని అర్థం అయింది.

జరిగినదానికి కృంగిపోవడం నచ్చక ఆర్థర్ దాన్నిచాలా పాజిటివ్ గా తీసుకున్నాడు.

ఇవన్నీ చాలనట్టు ఆపరేషన్ అయిన వెంటనే కుడి చేతికి పక్షవాతం వచ్చింది. పులిమీద పుట్ర లా, జరిగిన రెండో ఆపరేషన్ సమయంలో ఎక్కించిన రక్తం హెచ్.ఐ వీ తో కలుషితమవడం వల్ల అతనికి కూడా ఆ ఇన్‌ఫెక్షన్ సోకింది.

ఈ విషయాలు తెలిసిన ఆర్థర్ అసంఖ్యాకమైన అభిమానులు ప్రపంచం నలుమూలలనుంచీ ఉత్తరాలు రాయడం మొదలుపెట్టారు.

సెల్ ఫోన్ లు, ఇంటర్ నెట్లూ లాంటివేమీ కాలం లో మనుషులని కలిపే మహత్తరమైన వారధులు ఉత్తరాలే. ఒకటీ, రెండూ కాదు వందల సంఖ్యలో వెల్లువలా వచ్చే ఆ ఉత్తరాల నిండా ఆర్థర్ మీద తమకున్నప్రేమా, అభిమానమూ ప్రతిఫలించేవి.

దానితో పాటే ఆర్థర్ కి ఇలాంటి అన్యాయం జరగడం పట్ల అంతులేని బాధ కూడా.

'నీకే ఎందుకిలా జరింది ఆర్థర్? వై యూ?' అంటూ ప్రశ్నలు వేసేవారు.

అతని ఆరోగ్యం కోసం ప్రార్థిసూ ఈ విషయాల గురించి ఎంతో బాధ పడేవారు.

అంత గొప్ప ఆటగాడిగా ఇన్నాళ్ళూ ఎంతో ఘనమైన జీవితాన్ని గడిపిన ఆ అద్భుత క్రీడాకారుడు తన భవిషత్తు ఎలా ఉండబోతోందో? అన్న భయం మనసంతా ఉన్నా సరే దాన్ని ఎదుర్కొనడానికే నిశ్చయించుకున్నాడు కనక అదే సందేశాన్ని స్పష్టంగానూ, సూటిగానూ తన అభిమానులకి చెప్పేవాడు.

అతని సందేశం ఇలా ఉండేది.

' ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే దాదాపు ఐదు కోట్ల మంది పిల్లలు పెద్ద ఆటగాళ్ళుగా మారాలని టెన్నిస్ ఆట మొదలుపెడతారు. అందులో 50 లక్షల మంది మాత్రం ప్రొఫెషనల్ టెన్నిస్ వరకూ వస్తారు. ఆర్వాత అంతకు మించిన స్థాయికి 50000 మంది మాత్రమే చేరుకుంటారు. టెన్నిస్ ఆటలో Grand Slams గా పేరుపొందిన నాలుగు టోర్నమెంట్స్ కి ఆడగలిగే అర్హతనీ, ప్రావీణ్యాన్నీ 5000 మాత్రమే సంపాదిస్తారు. ఆ నాలుగింటిలోనూ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించబడే వింబుల్డన్ కి కేవలం 50 మంది చేరుకుంటారు.అందులోంచి నలుగురంటే నలుగురు సెమీ ఫైనల్స్ కి, ఇద్దరు మాత్రమే ఫైనల్ కి చేరుతారు. ఆపైన మనకి తెలిసిందే! విజేత ఎప్పుడూ ఒకరే ఉంటారు కదా. వింబుల్డన్ ఒక్కటే అని కాదు, మిగతావి కూడా అంతే. ఇన్నాళ్ళూ నేను గెలిచే ఆ ఒక్కడినై, అనేక కప్ లు గెలిచినప్పుడు, మీ అందరి అభిమానాన్ని పొందినప్పుడూ, దేవుడు తన అలవి కాని ఆశీర్వాదాలని నాపైన కురిపించినప్పుడూ, అలాంటప్పుడు ఎప్పుడూ, నేను ఒక్క క్షణం కూడా 'నేనే ఎందుకు?' ఇన్ని వేల, లక్షల మందిలో నేను మాత్రమే ఎందుకు విజేతనైనాను? ' Why only me?' అని ఒక్కసారి కూడా అనుకోలేదు. ప్రశ్నించుకోలేదు. అలాంటిది ఇప్పుడు, నా ఈ ప్రస్తుత పరిస్థితిలో మాత్రం నేను ఆ ప్రశ్నలు వేసుకోవడం ఎంతవరకూ సమంజసం??' ఏ కారణం చెప్పి ఆ ప్రశ్న వేసుకోగలను? ' అది ఎంతో, ఇది అంతే అనుకోవడం తప్ప. "

ఆర్థర్ జీవిత విశేషాలతో రాసిన ఆవ్యాసాన్ని ఒంటరిగా కూర్చుని మరొకసారి గుర్తుతెచ్చుకుంది యశోద.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments